సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



గంజాయి దహనం

తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న రూ.5.10 కోట్ల విలువ చేసే గంజాయిని పోలీసులు దహనం చేశారు.

- IIలో



అసంపూర్తి పనులతో అవస్థలు

ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని పోసానికుంట - రాజన్నగూడెం రోడ్డు అధ్వానంగా తయారైంది.

- IIIలో

గరిష్టం / కనిష్టం
45^{0} / 26^{0}

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య రావద్దు

భువనగిరిటౌన్ : వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయ సమావేశం మందిరంలో అధికారులతో సమావేశమై జిల్లాలో తాగునీటి సరఫరా, పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని ముందుకెళ్లాలన్నారు. జూన్ నెలలో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ నారాయణరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, ఎంపీడీఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

సెలవులు ఇవ్వాలంటూ విద్యార్థుల ధర్నా

బీబీనగర్: వేసవి సెలవులు ఇవ్వాలంటూ బీబీనగర్ మండలంలోని లక్ష్మీదేవిగూడెం పరిధిలో గల గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. అన్ని డిగ్రీ కళాశాలలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం.. గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలకు సెలవులు ఇవ్వడం లేదన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున యూనివర్సిటీ అధికారులు స్పందించి సెలవులు ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ స్పందిస్తూ సెలవులు విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

హైవేపై వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ నెలకొంది. శుభకార్యాలు అధికంగా ఉండడంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజానీకం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఇరువైపులా రద్దీ ఏర్పడింది. వాహనాల రద్దీ కారణంగా జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకుగాను వాహనదారులు, పాదచారులు దిబ్బందులు పడ్డారు.

ఆర్థిక స్వావలంబనకు రైతు సంఘాలు దోహదం



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా డైరెక్టర్

మోత్కూరు : రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలని, అందుకు రైతు ఉత్పత్తి సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మదర్ థెరిస్సా గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు, ఉమ్మడి నల్లగొండ జిల్లా డైరెక్టర్ జూలియన్ పాలిశెట్టి పేర్కొన్నారు. మోత్కూరు మండలం పాలడుగులో నిర్మించిన శ్రీమత్స్యగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు స్వతహాగా సమస్యలు పరిష్కరించుకోవడానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయన్నారు. రైతులకోసం నాబార్డు వ్యక్తిగత, సంఘ కూటముల సబ్సిడీ వ్యాపారాలకు వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ నాబార్డు అధికారి వినయ్‌కుమార్, సిరి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శ్రీనివాస్, ఏఓ కల్యూరి స్వప్న, రైతు సంఘం అధ్యక్షుడు వల్లపు సైదులు, మదర్ థెరిస్సా సంస్థ ప్రతినిధి రాజు, మాజీ ఉప సర్పంచ్ భగవంత్, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

నల్లగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన కోరారు. నల్లగొండ - వరంగల్ - ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఆమె నల్లగొండ కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ మే 2న వస్తుందని, 9 వరకు నామినేషన్ల స్వీకరణ,10న పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, జూన్ 5న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. జూన్ 8వ తేదీ నాటికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సమావేశంలో ఎన్నికల సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు సూర్యవంశీ, కళ్యాణ్‌కుమార్‌దాస్, అమోఘ జీవన్ గాంకర్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాల @ 45.1

భువనగిరిటౌన్ : జిల్లాలోని బొమ్మలరామారం మండలం మర్యాలపల్లిలో శుక్రవారం మాడు పగిలేంతగా ఎండ ప్రభావం కనిపించింది. ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయిలో 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మరో ఆరు మండలాల్లో 43.5 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగాయి. రానున్న మూడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రావొద్దని సూచించింది.

శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

గ్రామం	ఉష్ణోగ్రత
బుజిలాపురం	43.9
యాదగిరిగుట్ట	43.7
బొమ్మలరామారం	43.6
నందనం	43.5
జనగాం	43.5
చౌటుప్పల్	43.4
భువనగిరి	42.3



శుక్రవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన భువనగిరి- రాయగిరి రోడ్డు

వేసవిలో నీటి యాజమాన్యం తప్పనిసరి

భువనగిరి టౌన్ : వేసవిలో ఆయిల్ పామ్ తోటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. జిల్లాలో సుమారు 750 మంది రైతులు 3,600 ఎకరాల్లో ఆయిల్ పామ్‌తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున తప్పనిసరిగా నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. 1 నుంచి 3 సంవత్సరాల వయస్సు గల తోటల్లో జనుము, పచ్చిరొట్ట ఎరువు అంతరపంటగా వేయాలని, తద్వారా చెట్లకు చల్లదనం లభిస్తుందన్నారు. ప్రతి మొక్కకు ఇరువైపులా మైక్రో జెట్లు అమర్చుకోవాలని, చిన్నమొక్కలకు రోజూ 100 నుండి 150 లీటర్ల నీరు అందించాలని పేర్కొన్నారు.

పది తిరస్కరణ

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- 29 వరకు ఉపసంహరణ
- ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లతో ఉన్నవారిపై దృష్టి
- వారిని ఉపసంహరింపజేసే పనిలో ప్రధాన పార్టీలు
- గుర్తును పోలిన గుర్తు రాకుండా ఉండేందుకు ప్రయత్నాలు



నామినేషన్ల స్క్రూటీనీ సందర్భంగా సూచనలు చేస్తున్న రిటర్నింగ్ అధికారి, ఎన్నికల పరిశీలకుడు

సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల్లో మరో కీలక ఘట్టమైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. భువనగిరి లోకసభ స్థానానికి మొత్తం 61 మంది 116 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. అధికారులు స్క్రూటినీ చేసి సరిగా లేని 10 మంది నామినేషన్లను తిరస్కరించారు. ఎన్నికల పరిశీలకుడు క్షేత్రి మయూమ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే. జెండగేల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఒకటికి రెండుసార్లు పరిశీలన

అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను అధికారులు ఒకటికి రెండు సార్లు పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ చేశారు. తప్పులున్న నామినేషన్ల జాబితాను సిద్ధం చేసిన తర్వాత మరోసారి రాష్ట్ర ఎన్నికల సంఘంతో అధికారులు చర్చించారు. సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ సందేహాలను నివృత్తి చేసుకున్న అనంతరం సరిగా లేని నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.

పలువురు అభ్యర్థుల అఫిడవిట్‌లలో తప్పులు

పలువురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు సమర్పించిన అఫిడవిట్‌లో తప్పులు దొర్లడంతో వారికి ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. సరిచేసి మరోమారు అఫిడవిట్ ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత అందజేసిన అఫిడవిట్‌లో కూడా తప్పులు చోటు చేసుకోవడంతో వారి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. మరికొందరు అభ్యర్థులు తమ ప్రతిపాదితుల ఓటరు జాబితాలోని సీరియల్ నంబర్లు తప్పుగా నమోదు చేయడంతో వారి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యారు. అలాగే చివరి రోజు ఇద్దరు అభ్యర్థులు డిపాజిట్ డబ్బులు చెల్లించకుండానే నామినేషన్ పత్రాలు సమర్పించారు. దీంతో వారిద్దరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు.

బూర నర్సయ్యగౌడ్ పేరున్న మరో వ్యక్తి..

బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ పేరు ఉన్న మరో వ్యక్తి నామినేషన్ దాఖలు చేశారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బూర నర్సయ్య గురువారం చివరి నిమిషంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అయితే అభ్యర్థిని ప్రతిపాదించిన పది మంది పేర్లు ఉన్నప్పటికీ అందరి సంతకాలు లేకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. జాతీయ పార్టీ అభ్యర్థి పేరున అదే పేరుతో ఉన్న మరో వ్యక్తి నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది.

ఉపసంహరణపై దృష్టి

నామినేషన్ల పరిశీలన పూర్తి కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఉపసంహరణపై దృష్టి సారించాయి. ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. కాగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల పేర్లకు దగ్గరి పేర్లు కలిగి ఉన్న వ్యక్తులు కూడా నామినేషన్ వేయడంతో అటువంటి వారిని ఉపసంహరింపజేసే పనిలో ఉన్నారు. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ జారీ చేసిన కొన్ని గుర్తులు ప్రధాన పార్టీల గుర్తులను పోలి ఉన్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్ కారు గుర్తును పోలిన చపాతి రోలర్, రోడ్ రోలర్ వంటి గుర్తులు రాకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 15 మంది అభ్యర్థులు, నోటాతో కలిపి 16 గుర్తులతో ఒక ఈవీఎం ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న అభ్యర్థుల సంఖ్య ప్రకారం మూడు ఈవీఎంలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే నామినేషన్లను ఎంతమంది ఉపసంహరించుకుంటారన్నది మరో రెండు రోజుల్లో తేలనుంది. ఆ తర్వాత ఈవీఎంల సంఖ్య తేలనుంది.

తిరస్కరణకు గురైనది వీరివే..

బట్టుపల్లి అనురాధ (సీపీఎం), తండ ప్రేమలత (ఇండియా ప్రజాబంధు), శ్రీనివాస రావుహజారీ (స్వతంత్ర), రంగ సుధాకర్ (స్వతంత్ర), మందుల సతీష్ (స్వతంత్ర), కిరణ్ వంగపల్లి (రిపబ్లిక్ సేన), జి.లక్ష్మీనారాయణగౌడ్ (స్వతంత్ర), బూరనర్సయ్య (స్వతంత్ర), బీమనపల్లి వెంకటరమణ (స్వతంత్ర), మొద్దుకుమార్ (స్వతంత్ర) నామినేషన్ల తిరస్కరణకు గురయ్యాయి.

నల్లగొండలో 25 నామినేషన్లు రిజెక్ట్

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో మరో కీలక ఘట్టమైన నామినేషన్ల పరిశీలన ముగిసింది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి మొత్తం 56 మంది అభ్యర్థులు 114 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించగా వాటిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన సమక్షంలో పరిశీలించారు. ఇందులో నిబంధనల ప్రకారం సమర్పించని 25 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 31 మంది అభ్యర్థుల నామినేషన్లు నిబంధనల ప్రకారం ఉండడంతో వాటిని ఆమోదించారు.

బీజేపీవి కుల రాజకీయాలు

- అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నది కాంగ్రెస్ ఒక్కటే
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ర్యాలీలో ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ కులం పేరుతో రాజకీయాలు చేస్తున్నాడని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో ఆయన గెలుస్తాడా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం భూదాన్ పోచంపల్లిలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని.. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామని, పోచంపల్లి మండలానికి బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలు తీసుకొచ్చి ప్రతి ఎకరాకు సాగునీరు అందజేస్తామని తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు సొంత నిధులతో భీమనపల్లి చెరువు, పిలాయిపల్లి కాలువ నిర్మాణం చేయించానని గుర్తు చేశారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే పేద ప్రజలు, రైతులు, చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతామని కండువాలు జేబులో పెట్టుకొని తిరుగుతున్నారని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కూడ కాంగ్రెస్ పార్టీలో చేరుతానని తిరిగాడని, కానీ ఎంపీ టికెట్ ఇచ్చేది లేదని చెప్పడంతో ఇప్పుడు జగదీశ్‌రెడ్డి వెనుక తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కూడా ఆశీర్వదిస్తే డబుల్ అభివృద్ధి జరుగుతుందన్నారు. రూ.30 కోట్ల ప్రత్యేక నిధులు తీసుకువచ్చి భూదాన్‌పోచంపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా : చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మీ బిడ్డగా ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడం తప్పా.. ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్ రూ.9లక్షల కోట్ల అవినీతి చేసినా బొక్కలో వేయకుండా వారితో కుమ్మక్కయ్యారని విమర్శించారు. ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పున్న కైలాస్‌నేత, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షులు సామ మధుసూధన్‌రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మర్రి నర్సింహారెడ్డి, సామ మోహన్‌రెడ్డి, గునిగంటి రమేశ్, బందారు ప్రకాశ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నోముల మమత, కౌన్సిలర్లు భోగ భానుమతివిష్ణు, మోటె రజిత రాజు, సృజన, మెరుగు శశికళ, తడక రమేశ్, సూరెపల్లి రమేశ్, గౌరీశంకర్, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, కాసుల అంజయ్య, పక్కీరు మల్లారెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, పక్కీరు నర్సిరెడ్డి, అంబరీష్‌రెడ్డి, కుక్క కుమార్ తదితరులు పాల్గొన్నారు.

85,549 మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోలు

- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరిటౌన్ : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగంగా జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 323 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 8,483 మంది రైతుల నుంచి 85,549 మెటిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతుల ఖాతాల్లో రూ.35 కోట్లు జమ చేశామన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించామని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని వివరించారు. మిల్లర్ల కోసం కొనుగోలు కేంద్రాల దగ్గరలో ఉన్న ఏఎంసీ గోదాములు తెరిచామని, వర్షాలు వచ్చినా, ఇతర అవసరాల దృష్ట్యా వాటిని స్టాక్ పాయింట్లుగా వినియోగించడం జరుగుతుందన్నారు. బిహార్‌లో ఎన్నికల దృష్ట్యా హమాలీల కొరత రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ధాన్యం గ్రేడ్లపై అవగాహన కల్పించి, మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేయవద్దని ట్రేడర్లను హెచ్చరించామని, ఈ విషయంలో పౌర సరఫరాల కమిషనర్ కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. రైతులు పంట చేతికి రాకముందే ముందే కోసి కొనుగోలు కేంద్రాలకు తెస్తున్నారని, తద్వారా తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ఈ విషయమై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. కొనుగోళ్లలో సమస్య వస్తే ఫిర్యాదు చేయడానికి మండల స్పెషల్ ఆఫీసర్ల నంబర్లను కేంద్రాల్లో ప్రదర్శించామని, టోల్ ఫ్రీ నంబర్‌కు కూడా 7995120554 ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పోలింగ్ విధులకు 3,856 మంది

- పీఓ, ఏపీఓ, ఓపీఓల రెండో ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు, రిటర్నింగ్ అధికారి తదితరులు

సాక్షి,యాదాద్రి : పీఓ, ఏపీఓ, ఓపీఓల రెండో ర్యాండమైజేషన్ శుక్రవారం కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాబర్ట్ సింగ్ క్షేత్రిమయుమ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనమంతు కే.జెండగే సమక్షంలో నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించి 816 పోలింగ్ కేంద్రాలకు 3,856 మందిని కేటాయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, డీఈఓ నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్, ఈడీఎం సాయికుమార్, ఏఎస్ఓ నరహరి తదితరులు పాల్గొన్నారు.

సూచనల కోసం పరిశీలకుడిని సంప్రదించాలి

భువనగిరిటౌన్ : ఎన్నికలకు సంబంధించిన సూచనల కోసం, ఫిర్యాదులు చేయడానికి సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయూమ్‌ను నేరుగా లేదా ఫోన్ నంబర్ 9963469221 ద్వారా సంప్రదించవచ్చని రిటర్నింగ్ అధికారి, కలెక్టరు హనుమంతు కే.జెండగే శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో రోజూ సాయంత్రం 4 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య అందుబాటులో ఉంటారని తెలిపారు. సాధారణ పరిశీలకుడికి లైజనింగ్ అధికారిగా జిల్లా మత్స్యశాఖ అధికారి పి.రాజారామ్(9000368915) వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు సూచనలు, సలహాల కోసం, ఏదైనా ఫిర్యాదు చేయడానికి వారిని సంప్రదించాలన్నారు.

నేడు నల్లగొండకు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కోర్టులో నూతనంగా నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు నల్లగొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే హాజరై భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. హైకోర్టు జడ్జిలు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి హాజరుకానున్నారు.

కనుల పండువగా ఊంజలి సేవోత్సవం



అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు.అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠింపజేసి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం శ్రీస్వామి, అమ్మవారికి అభిషేకం, అర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, స్వామి, అమ్మవారి జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

నిరాశ కలిగించిన ఇంటర్ ఫలితాలు

- ప్రభుత్వ కళాశాలల్లో తగ్గిన ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయిలో ఫస్టియర్ 26, సెకండియర్ 25వ స్థానంలో జిల్లా
- కొన్ని కాలేజీల్లో పది శాతంలోపే ఉత్తీర్ణత
- రెండు సంవత్సరాలుగా ఇదే తీరు



భువనగిరి : ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు డీలాపడ్డాయి. ఫస్టియర్, సెకండియర్ లోనూ గతేడాదితో పొల్చితే ఫలితాలు పడిపోయాయి. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ప్రథమ సంవత్సరం 26, ద్వితీయ 25వ స్థానంలో నిలిచాయి. గత ఏడాది ప్రథమ 19, ద్వితీయ సంవత్సరం 22వ స్థానం దక్కింది. మెజార్టీ కాలేజీల్లో 50 శాతంలోపే ఫలితాలు రాగా.. కొన్ని పది శాతం లోపే ఉత్తీర్ణత సాధించడం ఆందోళన కలిగిస్తోంది.

50శాతం లోపు ఉత్తీర్ణత సాధించిన కాలేజీలు

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మార్చిలో జరిగిన వార్షిక పరీక్షలకు ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 724 మంది హాజరు కాగా.. 180 మంది ఉత్తీర్ణులయ్యారు. 24శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 816మందికి గాను 364 మంది విద్యార్థులు పాస్ కాగా 44 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాది ఫస్టియర్‌లో మొత్తం 1,248 మంది విద్యార్థులకు 523 మంది పాసయ్యారు. 43 శాతం ఉత్తీర్ణత వచ్చింది. సెకండియర్‌లో 1,354 మంది విద్యార్థులకు 804 మంది ఉత్తీర్ణులయ్యారు. 59శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది.

ఆలేరు, బొమ్మలరామారంలో పది శాతం లోపే..

ప్రథమ : ఆలేరు పట్టణంలోనిప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 38 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా బొమ్మలరామారంలో 65 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురే పాసయ్యారు. మిగిలిన తొమ్మిది కాలేజీల్లో 50 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.

ద్వితీయ : మోత్కూర్, భువనగిరి బాలికల, యాదగిరిగుట్ట జూనియర్ కళాశాల మినహా మిగతా ఎనిమిది కాలేజీల్లో ద్వితీయ సంవత్సరం 50 శాతంలోపు ఉత్తీర్ణులయ్యారు.

వసతులు కల్పిస్తున్నా మెరుగుపడని ఫలితాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏటేటా ఫలితాలు పడిపోతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా అధ్యాపకుల నియామకం, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అయినా ఉత్తీర్ణత మెరుగుపడకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు.. ఇంటర్‌కు వచ్చే సరికి ఉత్తీర్ణత తగ్గుతుంది.

ప్రభుత్వ కళాశాలలు సాధించిన ఉత్తీర్ణత ఇలా..

కళాశాల	ప్రథమ సంవత్సరం			ద్వితీయ..		
	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
ఆలేరు	38	03	7.89	50	08	16
మోత్కూరు	58	29	50	62	54	87
భువనగిరి(బాలుర)	42	05	11.09	45	11	24.44
భువనగిరి(బాలికల)	47	25	53.19	63	33	52.38
యాదగిరిగుట్ట	118	33	27.97	116	85	73.28
రామన్నపేట	56	16	28.57	89	38	42.7
వలిగొండ	65	14	21.54	74	34	45.95
చౌటుప్పల్	47	09	19.15	59	18	30.51
పోచంపల్లి	94	28	29.79	113	19	43.36
నారాయణపురం	94	15	15.96	112	21	18.75
బొమ్మలరామారం	65	03	4.62	33	13	39.39

ఎన్నికల ప్రచారంలో బాలలు !

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బాలలను ఉపయోగించే రాజకీయ పార్టీల గుర్తింపును ఎన్నికల కమిషన్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక భువనగిరి జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ తరఫున మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోలో కొందరు బాలలు పాల్గొన్నారని, దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కొన్ని పార్టీలు డబ్బు, బహుమతులు ఆశచూపి బాలల చేత ఎన్నికల కరపత్రాలు పంపిణీ చేయించడం, ఫలానా గుర్తుకు ఓటు వేయండని ప్రచారం చేయించడం బాలల హక్కుల ఉల్లంఘన కింద భావించి ఆయా పార్టీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాలల హక్కులను కాపాడుటకు ప్రజలు, రాజకీయ నేతలు, ప్రజాస్వామికవాదులు, అధికారులు చిత్తశుద్ధితో కృషిచేయాలని కోరారు.

హరీష్‌రావుది రాజీనామా నాటకం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

భూదాన్‌పోచంపల్లి: హరీష్‌రావు అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి రాజీనామా నాటకం ఆడుతున్నాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. రాజీనామా చేసి బీజేపీలోకి పోతావా అని హరీష్‌రావును ఉద్దేశించి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో, కార్నర్ మీటింగ్‌లో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. హరీష్‌రావుకు ఇప్పుడు ప్రజలు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని లేదంటే తల నరుక్కుంటా అని చెప్పి.. మాటమార్చిన మీ మామ కేసీఆర్ తల మొదట నరికి, ఆ తరువాత మా దగ్గరికి రావాలని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైందని, రైతు రుణమాఫీతో సహా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. పదేళ్లు అధికారాన్ని అడ్డంపెట్టుకుని కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు సంపాదించిందని ఆరోపించారు. వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదన్నారు. కవితమ్మ జైలుకు పోయిందని, త్వరలో కేసీఆర్, కేటీఆర్ కూడా జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఎవరూ వచ్చిన చేర్చుకోవాలని చెప్పారని, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి జేబులో కండువాలు పెట్టుకొని తిరుగుతున్నారని అన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం, దుకాణం బంద్ అవుతుందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.


మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి


దామరచర్లలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

మిర్యాలగూడ : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలోని కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే దామరచర్ల మండలంలోని థర్మల్ విద్యుత్ కేంద్రం, పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పిస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి చేసి టెయిల్ లాండ్ భూములకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. దేశంలో సుస్థిరత, సమగ్రత, అభివృద్ధి ప్రధాని మోదీతోనే జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ కూటమి 400లకు పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, జానకిరాంరెడ్డి, సైదారావు, సీతారాంరెడ్డి, కణ్మంతరెడ్డి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

నడిగూడెం: రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించాలని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల్ని తామే ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటుందని తెలిపారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, కోదాడ నియోజకవర్గ కన్వీనర్ నారాయణ, కో-కన్వీనర్ కృష్ణయ్య, మండల ఎన్నికల ఇన్‌చార్జి కవిత, మండల అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ

నల్లగొండ: రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని నల్లగొండ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ అన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినట్లు తమ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈవీఎం ద్వారా పోలింగ్ రోజు నిర్వహించే మాక్ పోలింగ్, సీ-విజిల్ యాప్, సువిధ తదితర అంశాల గురించి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ.. పోటీలో ఉన్న అభ్యర్థులు వారి ఎన్నికల ఖర్చును పక్కాగా నిర్వహించాలని, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ప్రతినిధులు అన్ని అనుమతులను సింగిల్ విండో ద్వారా ఇవ్వాలని వారికి విన్నవించారు. సమావేశంలో ఎన్నికల పోలీసు పరిశీలకుడు అమోఘ్ జీవన్ గాంకర్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రం తనిఖీ

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ హరిచందన, ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్, పోలీస్ పరిశీలకుడు అమోగ్ జీవన్ గాంకర్ తనిఖీ చేశారు. అదేవిధంగా సోషల్ మీడియా, సువిధ, ఇంటిగ్రేటెడ్ జిల్లా కంట్రోల్ రూం, సీ-విజిల్ విభాగాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన ప్రకటనల గుర్తింపు, పెయిడ్ న్యూస్ స్కానింగ్, రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తదితర రిజిస్టర్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఆర్ఓ రాజ్యలక్ష్మి, ఎంఎంసీ సభ్యుడు యు. వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.


మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు

ఎయిమ్స్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

- సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్


ప్రచారంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్‌పై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. శుక్రవారం ఆయన బీబీనగర్ మండలంలోని మక్తా అనంతారం, వెంకిర్యాల, రాఘవాపురం, బీబీనగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిమ్స్ నిర్మాణం పూర్తయితే 5 జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఎయిమ్స్‌లో రోగుల సంఖ్య పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మతాన్ని, దేవుడిని అడ్డం పెట్టుకొని బీజేపీ ఓట్లు రాబట్టాలని చూస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీకి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. పేదల పక్షాన ఉండే సీపీఎంని ఆదరించాలన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరి జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేష్, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జంగయ్య, ఉమర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి కొండపై హెల్ప్ డెస్క్



కొండపై బస్టాండ్‌లో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఈఓ, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో గల బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం, హెల్ప్ డెస్క్‌ను దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొండపైన ఇబ్బందులు పడకుండా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని వారు తెలిపారు. కొండపైన దర్శనం వేళలు, టిక్కెట్ ధరలు, ప్రసాద విక్రయశాలతోపాటు కొండపైన శివాలయం, దర్శనానికి వెళ్లే మార్గాలను సిబ్బందితో మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేసేలా ఈ హెల్ప్‌డెస్క్‌ను తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రూ.5 కోట్ల విలువైన గంజాయి దహనం

- యువత మత్తుకు బానిస కావొద్దు: నల్లగొండ ఎస్పీ


గంజాయిని పరిశీలిస్తున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న రూ.5,10,75,000 విలువైన గంజాయిని శుక్రవారం నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో దహనం చేశారు. నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 39 కేసుల్లో పట్టుబడ్డ 2,043 కేజీల గంజాయిని సీజ్ చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేసినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల సరఫరాపై టోల్‌ఫ్రీ నంబర్ 87126 71111కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన పోవానపు రంజిత్(18) చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని రిలయన్స్ పెట్రోల్‌బంక్‌లోని స్టోర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి డ్యూటీ ముగిశాక పోచంపల్లి మండలంలోని మెహర్‌నగర్ గ్రామంలో ఉన్న తన మేనమామ ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వస్తున్నాడు. ఈక్రమంలో మల్కాపురం శివారులో ఐటీసీఎల్ ఎదురుగా బైక్‌ను సిమెంట్ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంజిత్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ..

ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో లారీ ఢీకొన్న ఘటనలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గోల్‌తండాకు చెందిన బానోత్ ఛూరి(58) అక్కడికక్కడే మృతి చెందింది. బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు శుక్రవారం వస్తున్న ఆమె వరంగల్ క్రాస్ రోడ్ వద్ద బస్సు దిగింది. అక్కడ మూత్రవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా వరంగల్ వైపు నుండి ఖమ్మం వెళ్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టడమే కాక, ఆమె వీపుపై నుండి వెనుక చక్రాలు వెళ్లడంతో శరీరం రోడ్డుకు అతుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఛూరి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఈతకు వెళ్లిన తండ్రీకుమారుడు గల్లంతు

- కుమారుడి మృతదేహం లభ్యం
- తండ్రి కోసం గాలింపు


బోద నరేష్


సాయి (ఫైల్)

మోటకొండూర్, ఆత్మకూరు (ఎం) : మోటకొండూర్ మండలంలోని చాడ గ్రామంలో శుక్రవారం వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన తండ్రీ కొడుకులు ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యారు. ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన బోద నరేష్(40) ఆయన కుమారుడు బోద సాయి(11) మోటకొండూర్ మండలంలోని చాడ గ్రామంలోని బంధువుల ఇంటికి ఎల్లమ్మ పండగ నిమిత్తం వచ్చారు. వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. బావిలో దూకిన ఇద్దరూ అందులో మునిగిపోయారు. బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని మృతదేహాల కోసం గాలించగా.. కుమారుడి మృతదేహం లభించింది. తండ్రి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తేజంరెడ్డి తెలిపారు.

సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత


అఖిరానందన్ (ఫైల్)

మఠంపల్లి: స్నేహితులతో కలిసి వ్యవసాయబావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. వివరాలు.. ఖమ్మం జిల్లాకు చెందిన అఖిరానందన్ (20) కోదాడలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. మఠంపల్లి మండలం అల్లీపురంలో అతడి స్నేహితుడి చెల్లెలు పెళ్లి ఉండడంతో అంబేద్కర్ నగర్‌కు చెందిన స్నేహితుడు అక్షయ్‌ను పిలిపించుకుని మరికొందరితో కలిసి శుక్రవారం వెళ్లాడు. అక్కడ ఐదుగురు స్నేహితులు అల్లీపురం సమీపంలోని బావి వద్దకు చేరుకున్నారు. అయితే, అఖిరానందన్ బావిలో దూకి తిరిగి బయటకు రాలేదు. దీంతో భయానికి గురైన స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గేదె కళేబరాన్ని ఢీకొట్టిన బైక్

- మహిళ మృతి

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి గేదె కళేబరాన్ని ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని బి. చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాకు చెందిన బానోతు అమ్ములు(40) తన బంధువు బైక్‌పై సూర్యాపేటకు వస్తుండగా మార్గమధ్యలో చివ్వెంల మండలం బి. చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై గేదె కళేబరాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అమ్ములు కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆమెను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి భర్త బోడ్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. వెంకట్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

నూతనకల్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్లలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ కోమటిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేసోజు బ్రహ్మచారి పెద్ద కుమార్తె ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామానికి చెందిన పడకంటి అరుణ(38) తన తల్లిగారి ఇంటికి వచ్చింది. తండ్రి నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో టేబుల్ ఫ్యాన్ వైర్ ప్రమాదవశాత్తు ఎడమ చేతికి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి తండ్రి దేసోజు బ్రహ్మచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

డిండి: బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. డిండి మండల పరిధిలోని కందుకూర్ గ్రామానికి చెందిన ఎరుకల వెంకటయ్య(48) పనినిమిత్తం బైక్‌పై చెర్కుపల్లికి వచ్చాడు. పని ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరగా వెంకటయ్య నడుపుతున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బండరాయికి ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య చిట్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు

- ఆస్పత్రిలో కోలుకుంటున్న శ్రీకాంత్ భార్య నాగమణి

కోదాడ రూరల్: కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం బైపాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా వారి మృతదేహాలకు గురువారం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన వారిలో జిల్లా శ్రీకాంత్‌తో పాటు అతని కుమార్తె లాస్య అంత్యక్రియలను వారి సొంత గ్రామమైన చిమిర్యాలలో నిర్వహించారు. శ్రీకాంత్ మూడేళ్ల చిన్న కుమార్తె లావణ్యతో తలకొరివి పెట్టించినట్లు బంధువులు తెలిపారు. ఆ చిన్నారి అమ్మానాన్న, అక్క ఎక్కడ ఉన్నారని, ఎప్పుడు వస్తారని దీనంగా అడుగుతుండడం పలువురిని కంటతడి పెట్టించింది. చిన్నారి ఎక్కువగా ఏడుస్తుండడంతో తలకు అంతర్గత గాయాలేమైనా అయ్యాయా అని పరీక్షల నిమిత్తం కోదాడ వైద్యశాలకు తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. ఇక ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురానికి చెందిన నలుగురు రాంచందర్‌రావు, అతని భార్య మాణిక్యమ్మ, కొడుకు కృష్ణంరాజు, కోడలు స్వర్ణకుమారి మృతదేహాలకు రాంచందర్‌రావు తండ్రి కోటయ్య తలకొరివి పెట్టాడు. కాగా.. తీవ్రగాయాలపాలైన శ్రీకాంత్ భార్య నాగమణి ఖమ్మం ఆస్పత్రిలో కోలుకుంటుందని బంధువులు తెలిపారు. ప్రమాదంలో ఆమె భర్తతో పాటు కుమార్తె, తల్లిదండ్రులు, తమ్ముడు, మరదలు మృతి చెందిన విషయాన్ని ఆమెకు ఇంకా చెప్పలేదని బంధువులు పేర్కొన్నారు. ఆమె నోటికి తీవ్ర గాయమై పళ్లు ఊడిపోవడంతో శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.50వేలు కావాలని చెప్పారు. అయితే అయిన వారందరూ మృతి చెందడంతో వైద్యానికి అయ్యే ఖర్చుకు దాతల సాయం కోసం ఎదురుచేస్తున్నారు.

నీటి కుంటలో పడి వృద్ధుడు మృతి

చౌటుప్పల్: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్క రాములు(80)కి భార్యాపిల్లలు లేరు. మానసికస్థితి సరిగా లేకపోవడంతో ఒక్కడే బంధువుల గ్రామాలకు నడుచుకుంటూ వెళ్తుంటాడు. ఈక్రమంలో పది రోజుల క్రితం వలిగొండలోని సోదరి దుర్గమ్మ వద్దకు వెళ్లేందుకని ఇంటినుంచి బయల్దేరాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని బొమ్మలకుంటలో శవమై తేలాడు. ఈ విషయాన్ని అక్కడ పశువులు మేపుతున్న గ్రామస్తుడు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. మృతుడు ప్రమాదవశాత్తుగా కుంటలో పడి మృతిచెందినట్లు పలువురు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

సంస్థాన్ నారాయణపురం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వాహనదారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ మునావర్ (20), ఎండీ.షఫీ బతుకుదెరువు నిమిత్తం చౌటుప్పల్‌లో నివాసం ఉంటూ టైల్స్ వేసే కార్మికులుగా సంస్థాన్ నారాయణపురంలోని ఓ షాపులో పనిచేస్తున్నారు. మునావర్ శనివారం తన సొంతం గ్రామం బిహార్‌లోని హాజీపూర్ వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. పనులు పూర్తి చేసుకుని సంస్థాన్ నారాయణపురం నుంచి చౌటుప్పల్‌కు బైక్‌పై షఫీతో కలిసి వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకబావితండాకు చెందిన పానుగోతు భూపతి, కరెంటోత్ బబుల్ బైక్‌పై చౌటుప్పల్ నుంచి వెంకబావితండాకు వస్తుండగా గుడిమల్కాపురం శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మునావర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భూపతి, బబుల్‌కు గాయాలు కావడంతో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మునావర్ మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై సంస్థాన్ నారాయణపురం ఎస్ఐ వివరాలు సేకరిస్తున్నారు.

గొడ్డలితో దాడి

బీబీనగర్: పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ మహిళపై మరో మహిళ గొడ్డలితో దాడి చేసింది. ఈ ఘటన శుక్రవారం బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన సోని శుక్రవారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్తుండగా అదే సమయంలో గ్రామానికి చెందిన గుండెబోయిన మౌనిక పాత కక్షలను మనసులో పెట్టుకొని సోనిపై వెనుక నుంచి గొడ్డలితో దాడి చేసింది. దీంతో సోని తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను గ్రామస్తులు భువనగిరిలోని ఆస్పత్రికి తరలించారు. సోని భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం


బండ లాగుతున్న గిత్తలు

మఠంపల్లి: మఠంపల్లిలోని శుభవార్త చర్చి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలను శుక్రవారం ఫాదర్ మార్టిన్ పసల ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు, కృష్ణా, సూర్యాపేట జిల్లాలకు చెందిన 11జతల గిత్తలు తలపడ్డాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ అల్లం బాల్‌రెడ్డి, బ్రదర్ వినోద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లూర్దుమారెడ్డి, బాలరెడ్డి, గాలి చిన్నపురెడ్డి, బోయపాటి ఆంతోనిరెడ్డి, గోపులూర్దు మారెడ్డి, రాయ భాస్కర్‌రెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, గాదె మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- పోసానికుంట - కప్రాయపల్లి బీటీ రెన్యూవల్‌కు రూ. 2.30కోట్లు మంజూరు
- రెండు నెలల క్రితం పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాకపోవడంతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు



పోసానికుంట - రాజన్నగూడెం మధ్యలో కంకర పరిచి వదిలేసిన రోడ్డు

ఆత్మకూరు(ఎం) : నెలల తరబడి రోడ్డు పనులు జరుగుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పోసానికుంట నుంచి రాజన్నగూడెం వరకు గల రోడ్డంతా అధ్వానంగా తయారైంది. దీంతో ప్రభుత్వం బీటీ రెన్యూవల్ కోసం రూ. 2.30కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులను కేసీఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుని రెండు నెలల క్రితం పనులు ప్రారంభించింది. ఆరు కిలో మీటర్ల పరిధిలో రహీంఖాన్‌పేట నుంచి తుక్కాపురం వరకు ఆరకిలో మీటరు వరకు మాత్రమే కంకర పోసి వదిలేశారు. అలివేలు ఎస్టేట్ నుంచి శుభం గార్డెన్ వరకు ఒక కిలో మీటరు మాత్రమే రెన్యూవల్ బీటీ పనులు జరిగాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతుందని పలువురు వాపోతున్నారు.

నిత్యం రద్దీగా..

తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు చాలా దగ్గర దారి కావడంతో రోడ్డు కావడంతో ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అయితే మండల పరిధిలోని పోసానికుంట నుంచి రాజన్నగూడెం వరకు చేపట్టిన బీటీ రెన్యూవల్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిర్మాణ పనులు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడం, కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రా త్రి సమయాల్లో వేగంగా వచ్చే వాహనదారులు రోడ్డు నిర్మాణ పనులు గుర్తించలేక, ఒక్కసారిగా వేగం అదుపు కాక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రెన్యూవల్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



పోసానికుంట నుంచి రాజన్నగూడెంకు బీటీ రెన్యూవల్ కోసం నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. రోడ్డంతా బీటీ లేని గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నా.

– జి. సత్యనారాయణ, టి. రేపాక

ఇబ్బందులు పడుతున్నాం



ఆత్మకూరు(ఎం) నుంచి మోత్కూరుకు పోయేందుకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. రెన్యూవల్ బీటీ నిర్మాణం కోసం నిధులు మంజూరైనా ఆలస్యం చేస్తున్నారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– నాతి రాజు,ఆత్మకూరు(ఎం)

త్వరలో పూర్తి చేయిస్తాం

బీటీ రెన్యూవల్ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఉంది. కొద్దిపాటి పనులను చేపట్టి వదిలేశారు. అసంపూర్తి పనుల వల్ల కలుగుతున్న ఇబ్బందులను కాంట్రాక్టర్‌ తెలియజేశాం. త్వరలోనే బీటీ రెన్యూవల్ రోడ్డు పనులు మొదలు పెట్టించి త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తాం.

– షహనాజ్, ఆర్అండ్‌బీ డీఈ

ముగిసిన ఉపనయన మహోత్సవం



హోమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

భువనగిరి : పట్టణ శివారులోని అండాల్ నగర్ పరిధిలో గల శ్రీ త్రిశక్తి మహాగాయత్రి దేవాలయంలో శ్రీ దేవోశ్ర దక్షిణామూర్తి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యజ్ఞాన గురుజీ పర్యవేక్షణలో కొనసాగుతున్న దశమహావిద్యా సామూహిక ఉపనయన మహోత్సవం శుక్రవారం ముగిసింది. వేడుకల్లో భాగంగా ఉదయం ఆవాహిత మండప పూజ, సంతాన నాగేంద్ర స్వామి మూల మంత్ర జపం,మాతంగేశ్వరి మహావిద్యా, కమలాత్మికా మహావిద్యా ఆరాధ, దిక్పాలక బలి, జయాది హోమాలు, మహా పూర్ణాహుతి, మహాదాశీర్వాదం, అవభృథం, కలశోద్వాసన ట్రస్ట్ అధ్యక్షుడు వివి రమణ సిద్ధాంతి, గంగు సత్యనారాయణశర్మ సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చందుపట్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి, కె.భాస్కర్‌రావు, కె.శ్యాంసుందర్‌రావు, రామేశ్వర్ రావు, విశ్వేశ్వరరావు, భానుప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యనారాయణరెడ్డి

భువనగిరి : పట్టణంలోని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం జాబ్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ ప్రైవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు గోవర్ధన్, వెంకటేశ్వర్లు, నవీన్, సాయికృష్ణ, విజయ్‌ల పర్యవేక్షణలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు సుమారు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆసంతరం కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, సీహెచ్ నవీన్, ఎల్లారెడ్డి, వెంకటేశం, ఉపేందర్‌రెడ్డి, సునిల్, శ్రావణి పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్‌ల అందజేత

బొమ్మలరామారం : మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు స్లిప్‌ల అందజేత ప్రక్రియను తహసీల్దారు శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్‌లు అందజేయాలని విధుల పట్ల అలసత్వం వహించవద్దని సూచించారు. మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లందరికీ ఓటర్ స్లిప్‌లను అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న బీఎల్ఓ

క్లుప్తంగా

వరి కొయ్యలను కాల్చొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న పద్మజ

రాజాపేట : వరి కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారిణి ఎస్.పద్మజ అన్నారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరికొయ్యల ఉపయోగాలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికొయ్యలను, గడ్డిని తగులబెట్టకుండా యూరియాతో మెత్తగా మాగబెట్టి పొలంలో కలియ దున్నితే నేలసారం పెరగడంతోపాటు, దిగుబడులలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. వరికొయ్యలను తగులబెట్టడం వల్ల కాలుష్యం పెరుగుతుందని, ప్రమాదాలు సంభవిస్తాయని, మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. గడ్డిని గొయ్యి తీసి పేడ, పశువుల మూత్రం, ఎండిన ఆకులు వేసి మాగబెడితే సేంద్రియ ఎరువు తయారవుతుందని వానపాములను కలిపి కూడా ఎరువుగా మార్చవచ్చన్నారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణాధికారి ఎం. కిరణ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గల్లంతు ఖాయం'

చౌటుప్పల్ : పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతు ఖాయమని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అధికారం కోల్పోయాక బీఆర్ఎస్ పార్టీ నాయకులు మతిభ్రమించి వ్యవహరిస్తున్నారని, రోజుకో రకంగా డ్రామాలు ఆడుతున్నారన్నారు. వంద రోజుల్లోనే గ్యారంటీలను అమలుచేసిన కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేసి నాలుగు ఓట్లు దండుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్ నాయకుల నీచ బుద్ధిని ప్రజలు ఇప్పటికే గుర్తించారని అన్నారు.

తాడిశెట్టి ప్రభాకర్‌కు నివాళి

గుండాల : మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తాడిశెట్టి ప్రభాకర్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ప్రభాకర్ మృతదేహాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎం.డి.షర్ఫుద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మండల నాయకులు ఇమ్మడి దశరథ గుప్తా, ఎస్.రామచంద్రయ్య, ఎం.డి.నిజాముద్దీన్, చిందం ప్రకాష్, అన్నెపర్తి యాదగిరి తదితరులు ఉన్నారు.

మోటె రమేష్‌కు సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : కాంగ్రెస్ సేవాదల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియమితులైన మోటె రమేష్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడారు. కాంగ్రెస్ సేవాదళ్ విభాగం పార్టీకి వెన్నెముక అన్నారు. సేవాదళ్ వలంటీర్లు క్రమశిక్షణకు మారుపేరన్నారు. నియోజకవర్గంలో సేవాదళ్ విభాగాన్ని బలోపేతం చేసి సామాజిక, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల వెంకటరాజిరెడ్డి, ప్రభాకర్, పూస బాలకిషన్, రెహాన్, పృథ్వీరాజ్, ఎండీ జమీరుద్దీన్, వెంకటేశం, అక్రం, గోదాసు భాస్కర్, కొమ్ము శేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రం లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భాగ్య, తల్లులు జ్యోతి, సంతోష, సామమ్మ, సంతోషి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భువనగిరి క్రైం : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ వెంకట్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో శుక్రవారం సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, వినోద్, అనిల్, బి.పాండు, రవి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నిర్వాహకులు

రాజాపేట : మండల కేంద్రంలోని శ్రీభక్తమార్కండేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆడెపు లక్ష్మీనారాయణ, శ్రీశైలం, ఆలయ పూజారి వైద్యాగ్నం చంద్రశేఖర్, ఆడెపు రాజు, గణేష్, సకినాల ఉపేందర్, శ్రీను, చిర్ర బాలకిషన్, పొట్టబత్తిని వెంకటేశం, చంద్రమౌళి పాల్గొన్నారు.

'చామల' గెలుపునకు కృషిచేయాలి



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

వలిగొండ : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపునకు కృషిచేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆరూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పిట్టల జనార్దన్ రెడ్డి, ఆరూర్ పీఏసీఎస్ చైర్మన్ పిట్టల వెంకట్ రాం రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, జడ్పీటీసీ వాకిటి పద్మా అనంత రెడ్డి, పాశం సత్తి రెడ్డి, గూడూరు శివ కాంత్ రెడ్డి, గుజ్జుల లక్ష్మారెడ్డి, తుమ్మల యుగంధర్ రెడ్డి, బెలిద నాగేశ్వర్, బొళ్ల శ్రీనివాస్,వెలుశు శివయ్య, గరిసె రవి,వలుగు సతీష్, దానయ్య, తుమ్మల సంతు, తుమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని మెహర్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆకుల రాంచంద్రం శుక్రవారం కాంగ్రెస్ గ్రామ ఇన్‌చార్జ్ ఆకుల వెంకటేశం ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. దేశ్‌ముఖి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దుర్గం మత్స్యేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూలూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆడెల లింగం యాదవ్ సైతం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, దాసరి జంగయ్య, ముత్యాల బాలిరెడ్డి, రెబెల్లి యాదగిరి, కోట బాలకృష్ణ, చెక్క శ్రీనివాస్, లింగస్వామి, లింగస్వామి, భాను, ప్రభాకర్, రాజు, సుదర్ పాల్గొన్నారు.

చామల గెలవాలని పూజలు

ఆత్మకూరు(ఎం): కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలువాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడి నగేష్,పట్టణ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, అయిలయ్య, ఎద్దు వెంకన్న, నోముల వెంకటరెడ్డి, భాస్కర్, కోరె మల్లేష్, వసకయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ప్రధానోపాధ్యాయుడు



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ పేపర్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య

ఆత్మకూరు(ఎం): తల్లిదండ్రుల మృతితో అనాథలైన చిన్నారులకు ఓ ప్రధానోపాధ్యాయుడు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం గ్రామానికి చెందిన యాట పాండు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించాడు. అతని భార్య ఆరు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించింది. దీంతో ఆ దంపతుల ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మిగిలారు. గ్రామంలోనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వి.నర్సయ్య తనతో చదువుకున్న మిత్రుల నుంచి, తోటి ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించారు. వచ్చిన మొత్తం రూ.36వేలను స్థానిక పోస్టాఫీస్‌లో పిల్లలు యాట ప్రసన్న, అక్షర పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను శుక్రవారం తాత మల్లయ్య, అమ్మమ్మ అండాలు, పిల్లలకు అందజేశారు.

వైభవంగా కాటమయ్య పండుగ



మంగళహారతులు, బలిబిందెలు ఎత్తుకుని వస్తున్న భక్తులు

రామన్నపేట : మండలంలోని సిరిపురం గ్రామంలో సురమాంబ సమేత కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం బలిబిందెలు, పంచామృతాలను మంగళ హారతులతో ఊరేగింపుగా తీసుకువెళ్లి మూలవిరాట్టులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దగౌడ్ కూనూరు క్రిష్ణమూర్తి, కూనూరు సుదర్శన్, ముత్యాలు, రాజయ్య, బందారపు గోపాల్, వెంకటేశం, పబ్బు మల్లయ్య, కూనూరు వెంకటేశం, బందారపు శేఖర్, దంతూరి నర్సింహ, యాదగిరి, పబ్బు నర్సింహ, రామయ్య పాల్గొన్నారు.

శునకానికీ రక్షణ!

మోత్కూరు : ఎండల తీవ్రత పెరిగిపోవడంతో పెంపుడు జంతువులను కూడా యజమానులు జాగ్రత్తగా చూసుకుంటున్నారు. శుక్రవారం ఓ వ్యక్తి తన శునకానికి చల్లని గుడ్డ చుట్టి బైక్‌పై తనతో పాటు తీసుకెళ్తున్న దృశ్యం మోత్కూరులో కనిపించింది.



శునకానికి చల్లని గుడ్డ చుట్టి బైక్‌పై తీసుకెళ్తున్న దృశ్యం

ఎండీ జహంగీర్ ను గెలిపించాలి

వలిగొండ : సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిశాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాటూరి బాల రాజు, సిర్పంగి స్వామి,కొండయ్య, వెంకయ్య, అలివేలు , రేణుక, పద్మమ్మ పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

రామన్నపేట : పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య అన్నారు. శుక్రవారం నీర్నెముల గ్రామంలో సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. సీపీఎంకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి వెంకటేశం,నాగటి ఉపేందర్, బండ జగన్మోహన్‌రెడ్డి, నాగటి మహేష్, నేమనంది లింగయ్య, బోయిని మల్లేష్, ఏఐవైఎఫ్ రవి, బల్లెం సత్తయ్య, మానపాటి స్వామి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం



బొమ్మలరామారం: మర్యాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



మోత్కూరు: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చినుకని మల్లేశ్, పంతంగి ఎంపీటీసీ బోయ ఇందిర సంజీవ, పాలకుర్ల జంగయ్యగౌడ్, కొలంకొండ ఆశోక్, మిర్యాల రవి, పిశాటి సంజీవకుమార్, చింద భాస్కర్, బాతరాజు వెంకటేశం, నరేష్, వెంకటేష్, పాపయ్య, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని మర్యాల గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముత్యాల సుదేందర్‌రెడ్డి, ముద్దం శేఖర్ రెడ్డి, ముత్యాల హన్మంత్‌రెడ్డి, నిమ్మ వెంకట నర్సింహ్మారెడ్డి, బీర గణేష్, పాముల వర్ధిని రేష్ చారి, నాగిరెడ్డి సుభాష్ రెడ్డి, పులిమామిడి నరేష్ చారి,వెంకటేష్, సంజయ్, బండ భరత్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

యాదగిరిగుట్ట రూరల్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర నాయకుడు పడాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాపురం, సైదాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ నాయకత్వంలో భారతదేశం అత్యున్నత స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల చెందిన పలువురు బీజేపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, జిల్లా కోశాధికారి కాదూరి అచ్చయ్య, ఆశోక్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, బీరస్వామి, నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, కల్లెం శ్రీనివాస్ గౌడ్, గోపగాని ప్రసాద్ గౌడ్, భువనగిరి శ్యామ్, పోశెట్టి పాల్గొన్నారు.

మోత్కూరు : బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోతం సోమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. మూడోసారి మోదీ ప్రభుత్వం 400 సీట్లతో అధికారంలోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నరసింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, మరాఠి అంజయ్య, జక్కు మోహన్‌రెడ్డి, రేపాక నరేష్, మామిడాల యాకేష్, దాద మంజుల, బలుగు దశరథ, ఎడ్ల రాము, కందుకూరి ప్రకాష్, నిలిగొండ మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మండలంలోని తిమ్మాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ తిక అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాగం సత్తిరెడ్డి, శ్యామల నరేష్, కొసన నితిల్, కొసన సతీష్ పాల్గొన్నారు.

రామన్నపేట : బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండలకేంద్రంలోని 32,33,34 బూత్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దయ్యంకంటి వెంకటేశ్వరాచారి, కొమ్ము యాదయ్య, సింగం లింగయ్య, కూనూరు సుధాకర్, నకిరేకంటి సుదర్శన్, చిన్నపాక స్వామి, మోటె బీరప్ప, గురుకు సైదులు, గొరిగె బీరప్ప, కట్కూరి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి ఊరంతా సహకారం



బంగారం ఆభరణాలు అందజేస్తున్న గ్రామస్తులు

అడ్డగూడూరు : మండల పరిధిలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన నిరుపేద సమత పెళ్లికి గ్రామస్తులు అండగా నిలిచారు. లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన దామెర్ల సమత తల్లిదండ్రులు దామెర్ల లక్ష్మయ్య-సైదమ్మ జీవనం అనారోగ్యంతో మృతిచెందారు. అయితే సమత పెళ్లి ఇటీవల కుదిరింది. పెళ్లి ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమతకు ఆర్థికసహాయం చేయాలని గ్రామానికి చెందిన రజక సంఘం అధ్యక్షుడు ఆక్కెనపెల్లి నర్సయ్య గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయగా గ్రామస్తులు స్పందించారు. గ్రామ వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.లక్షా యాభై వేలు సమకూరాయి. ఆ డబ్బులతో రెండు తులాల పుస్తెల తాడు, అర తులం చెవుల కమ్మలను కొనుగోలు చేసి శుక్రవారం సమతకు ఆక్కెనపెల్లి నర్సయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సమత బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

'చీకట్లో వెన్నెల' కథనానికి స్పందన



కిరాణ దుకాణం ఎదుట దాతలు

తుర్కపల్లి: సాక్షి మానవీయ కథనం ఓ కుటుంబంలో వెలుగులు నింపింది. రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన భర్త, ఇద్దరు చిన్నపిల్లలు బతకడమే కష్టమైన తరుణంలో సాక్షి దినపత్రిక 2021, మార్చి 14న 'చీకట్లో వెన్నెల'అనే కన్నీటి గాథగా ప్రచురించింది. కథనానికి స్పందించిన దాతలు కుటుంబానికి నాటినుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ కథనాన్ని చూసిన ఆమెరికాలో ఉన్న ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవా సంస్థ హెచ్ ఫర్ స్పందన ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.లక్ష 50 వేలతో కిరాణం దుకాణాన్ని ఏర్పాటు చేయించి శుక్రవారం సంస్థ సభ్యుడు డాక్టర్ గణేశ్ బాబు ప్రారంభించారు. తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బత్తుల నరేందర్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. 2020లో జరిగిన ప్రమాదంలో నరేందర్‌కు వెన్నుపూస విరిగిపోయింది. దీంతో నరేందర్ మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణ కోసం నరేందర్ భార్య వెన్నెల పడుతున్న కష్టాన్ని సాక్షి 'చీకట్లో వెన్నెల' అనే కథనాన్ని సాక్షి ప్రచురించింది. స్పందించిన ప్రవాస భారతీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యూజెర్సీకి చెందిన ఆక్కెని మహేష్, ఖాజకర్లకు దిలీప్ పటేల్ రూ.లక్ష 50 వేలు ఆర్థిక సహాయం అందించి వెన్నెలకు కిరాణషాపు ఏర్పాటు చేయించారు. బత్తుల నరేందర్‌కు మెడికల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహ కోటా, రఘు అరుకుల, హేమశేఖర్, దయ్యాల మహేష్, జక్కు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన వారిని తిరిగి చేర్చుకోవద్దు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరి రూరల్: కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకోవద్దని డిమాండ్ చేస్తూ పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలానికి చెందిన ఇతర పార్టీల నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అనుమతి లేకుండా గాంధీ భవన్‌లో పార్టీలో చేరడంపై ద్రోహం చేసిన వారిని ఉపేక్షించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు వెంకటేష్, శివానంద, నాగయ్య, శ్రీనివాస్, కొండల్, బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

తుర్కపల్లి: మండలంలోని రుస్తాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పంతి ప్రసాద్, కుందారం వెంకటేష్, బెజ్జంకోయిన ఆంజనేయులు, జిన్న జహంగీర్, పంతం చందు, బిచ్చాల ఉదయ్‌కుమార్‌లు శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మోహన్‌బాబునాయక్, కోమటిరెడ్డి సంతోష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మారగోని శ్రీరాములు, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటేశం, నర్సింహ, సీలం సునిల్, రాములు, నవీన్, మహేందర్, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య

మోత్కూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన పల్లపు సమ్మయ్య వడ్డెర కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలయ్య తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకటించారని సమ్మయ్య శుక్రవారం విలేకరులకు తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- ప్రాణాలతో బయటపడ్డ యువకులు

బీబీనగర్: మండలంలోని భట్టుగూడెం గ్రామ పరిధిలోని నాగిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో గల చెరువు కట్టపై ప్రయాణిస్తున్న ఓ కారు అదుపుతప్పి చెరువులో పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండకు చెందిన రాజ్‌కుమార్, ప్రశాంత్ శుక్రవారం పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో బంధువుల పెళ్లికి హాజరై తిరిగి వారి కారులో నల్లగొండకు బయల్దేరారు. భట్టుగూడెం వద్ద కారు అదుపు తప్పి కట్టపైనుంచి చెరువులోకి వెళ్లింది. వాహనం అదుపులోకి రాకపోవడంతో అప్రమత్తమైన యువకులు కారు డోర్లు తీసి బయటకు దూకారు.



చెరువులో పడిపోయిన కారు